సాక్షి
జోగులాంబ గద్వాల
శనివారం, 9, డిసెంబర్, 2023



..సాకారమయ్యేనా?
పేదలకు స్థలాలు కేటాయిస్తూ పట్టాలిచ్చినా.. సొంతింటి కల నెరవేరలేదు.
వివరాలు 8లో ▸



గెలుపోటములు సమానం..
క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని డీఈఓ రవీందర్ అన్నారు.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.8 /23.4
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి. చిరుజల్లులు కురవొచ్చు.

న్యూస్‌రీల్

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న దివ్యాంగులకు రాష్ట్రస్థాయిలో అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి ముషాయిదా బేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ఉద్యోగులు, స్వయం ఉపాధి, వ్యక్తిగత, సామాజిక సేవకులు ఈనెల 10వ తేదీలోగా www.telangana.gov.inఅనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పత్తి మిల్లుల తనిఖీ



అయిజ: పాన్ ఇండియా రెస్క్యూ, రీహాబిలిటేషన్ ప్రోగ్రాంలో భాగంగా కార్మిక శాఖ, పోలీస్ శాఖ, మహిళాభివృద్ధి, శిషు సంక్షేమశాఖ అధికారులు శుక్రవారం మండల కేంద్రంలోని ఐదు పత్తి మిల్లులు, 10 రైస్ మిల్లులను తనిఖీ చేశారు. చైల్డ్ లేబర్‌గా పనిచేస్తున్న అమ్మాయిని రెస్క్యూ చేసి సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచారు. కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ మోహిన్ పాషా, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ విభాగం నుంచి లక్ష్మిదేవి, చైల్డ్ హెల్ప్‌లైన్ టీం సభ్యురాలు లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ హన్మంతు, శేషన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఏఐసీసీ కార్యదర్శి



అలంపూర్: రాష్ట్ర సచివాలయంలో సీఎం ఎనమల రేవంత్ రెడ్డిని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ సంపత్ కుమార్ కలిశారు. గురువారం సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో శుక్రవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై విస్తృతంగా చర్చించినట్లు సంపత్‌కుమార్ తెలిపారు. వీటితోపాటు స్థానికంగా చేపట్టాల్సిన ఇతర అభివృద్ధి పనులు ఇతర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.8,100

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శుక్రవారం 1079 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 8100, కనిష్టం రూ.3816, సరాసరి రూ.7500 ధరలు పలికాయి. అలాగే, 54 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్టం రూ.5449, కనిష్టం రూ.4719, సరాసరి రూ.5449 ధరలు వచ్చాయి. 3604 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.3429, కనిష్టం రూ.1719, సరాసరి ధర రూ.3169 ధరలు పలికాయి. 600 క్వింటాళ్ల వరి (హంస) రాగా, గరిష్టం రూ. 2600, కనిష్టం రూ.1882, సరాసరి రూ.2039 ధరలు వచ్చాయి.

మూసివేత దిశగా..!

ప్రవేశాలు లేక డిగ్రీ కళాశాలలు వెలవెల

- నాలుగేళ్లలో పీయూ పరిధిలో 11 ప్రైవేటు డిగ్రీ కళాశాలల మూసివేత
- తక్కువ అడ్మిషన్లు వచ్చిన కళాశాలలను ఇతర వాటిలో కలిపేస్తున్న ప్రభుత్వం
- ఈ ఏడాది 31,200 సీట్లకు 13,196 అడ్మిషన్లు



ఉమ్మడి జిల్లా వివరాలిలా..

పీయూ పరిధిలోని కళాశాలలు : 80	మూతబడిన కళాశాలలు 11
పీయూ పరిధిలోని సీట్లు 31,200	భర్తీ అయినవి 13,196
తక్కువ అడ్మిషన్లు వచ్చి ఇతర వాటికి తరలించిన కళాశాలలు: 4	



పీయూ ముఖద్వారం

విద్యార్థుల్లో టెక్నికల్ కోర్సులపై మక్కువ పెరగడం.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంఖ్య పెంపు.. కరోనా తర్వాత మారిన పరిస్థితులు.. వెరసి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఆశించినంతగా అడ్మిషన్లు లేక కొన్ని.. సగం సైతం సీట్లు భర్తీ కాకపోవడంతో మరికొన్ని.. అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లించడం భారం కావడంతో పీయూ పరిధిలో నాలుగేళ్లలో 11 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు మూతపడ్డాయి. ఈ విద్యాసంవత్సరం సైతం కేవలం 42 శాతం సీట్లు భర్తీ కావడాన్ని చూస్తే ప్రైవేట్ డిగ్రీ కళాశాలలపై విద్యార్థులకు ఉన్న ఆసక్తి ఏంటో అర్థమవుతోంది.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ఏటా విద్యార్థులు అడ్మిషన్లు తగ్గుముఖం పట్టాయి. దోస్తు వెబ్‌సైట్ ద్వారా ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లను చేపడుతుంది. ఈ క్రమంలో గతంలో ప్రతి సంవత్సరం 60 నుంచి 50శాతం మధ్యలో అడ్మిషన్లు జరిగేవి. కానీ ఈ సంవత్సరం కేవలం 42 శాతం మాత్రమే అడ్మిషన్లు జరగడంతో ప్రైవేటు కళాశాలలకు పరిస్థితులు శరాఘాతంగా మారాయి. అర్బన్ ఏరియాలోని కళాశాలల్లో కొద్దో గొప్పో అడ్మిషన్లు జరుగుతున్నా.. రూరల్ ఏరియాలోని కళాశాలలు అడ్మిషన్లు లేక వెలవెలబోతున్నాయి. కొన్ని కళాశాలలను మూసివేసే పరిస్థితి నెలకొంది. కళాశాలలో మూతబడడంతో పలువురు టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది ఉపాధిని కోల్పోతున్నారు. బీఈడీ కళాశాలల పరిస్థితి కూడా అలాగే ఉంది. చాలా కళాశాలలు భవనాలను ప్రభుత్వ గురుకులాలకు ఇతర అవసరాల కోసం అద్దెకు ఇచ్చి నామమాత్రంగా కళాశాలలను నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలల పెంపు కారణమా?

ఏటా ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు పెంచడంతోనే విద్యార్థులు వాటిలో అడ్మిషన్లు పొందుతున్నారని.. దీంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయని ప్రైవేట్ యాజమాన్యాలను సందేహిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు ఆరు డిగ్రీ గురుకులాలు, మక్తల్, ధన్వాడకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో పాటు ఎంవీఎస్, ఎన్టీఆర్, బీబీఆర్ వంటి పెద్ద కళాశాలలలకు ప్రభుత్వం కొత్త కోర్సులు ఇవ్వడం, వీటిలో పెద్ద సంఖ్యలో విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడం వంటి వాటి కారణంగా ప్రైవేటు కళాశాలల్లో సీట్లు తగ్గాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తగా ఉన్న అడ్మిషన్లలో కేవలం 42 శాతమే అడ్మిషన్లు జరిగాయి. ఈ క్రమంలో విద్యార్థులు ఎటూ పోతున్నారనే ప్రశ్నకు పీయూ అధికారుల నుండి కూడా సమాధానం దొరకరకడం లేదు. దోస్తు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఏ కళాశాలలో అయిన చేరేందుకు అవకాశం ఉండడంతో చాలా మంది విద్యార్థులు హైదరాబాద్, వరంగల్ వంటి ప్రాంతాలకు డిగ్రీలో టెక్నికల్ కోర్సుల్లో చేరుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

11 కళాశాలలు మూసివేత

కరోనా తర్వాత డిగ్రీ అడ్మిషన్లు ప్రతి సంవత్సరం తగ్గుతూ వస్తున్నాయి. ఈ సంవత్సరం అన్ని గ్రూప్‌ల వారికి పీయూ పరిధిలోని 80 కళాశాలల్లో 31,200 సీట్లను ప్రభుత్వం దోస్తులో అందుబాటులో ఉంచింది. ఇందులో భర్తీ అయ్యింది కేవలం 13,196 మాత్రమే. అంటే 42 శాతం మాత్రమే. దీంతో కళాశాలల్లో సీట్లు భర్తీ కాకపోవడంతో నాలుగు సంవత్సరాల కాలంలో యూనివర్సిటీ పరిధిలో 11 ప్రైవేటు కళాశాలలను మూసివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మహబూబ్‌నగర్‌లో ఇప్పటి వరకు 4 డిగ్రీ కళాశాలలను మూసివేశారు. మొత్తం కళాశాలల్లో కనీసం 75శాతం సీట్లు భర్తీ అయిన కళాశాలలు కనీసం ఐదు కంటే తక్కువగానే ఉన్నాయి. పీయూ పరిధిలో కేవలం ఈ ఒక్క సంవత్సరంలోనే 3 ప్రైవేటు కళాశాలలను యాజమాన్యాలు మూసివేశాయంటే పరిస్థితి అర్థం అవుతుంది.

నాణ్యమైన విద్యే లక్ష్యం



డిగ్రీలో నిర్దేశిత సీట్ల కన్నా తక్కువ అడ్మిషన్లు వచ్చిన కళాశాలల్లోని విద్యార్థులను ఇతర కళాశాలలకు తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పీయూ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ, బీఎడ్ చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. అడ్మిషన్లు తగ్గడానికి విద్యార్థులు టెక్నికల్ ఎడ్యుకేషన్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది.
– లక్ష్మీకాంత్ రాథోడ్, పీయూ వైస్‌చాన్స్‌లర్

4 కళాశాలల్లో విద్యార్థుల తరలింపు

వివిధ కళాశాలల్లో పలు కోర్సుల్లో కనీసం 50 శాతం కంటే తక్కువ సీట్లు భర్తీ అయితే వాటిని కొనసాగించవద్దని ప్రభుత్వం సూచించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని నాలుగు కళాశాలలకు సంబంధించి సుమారు 160 మంది విద్యార్థులను సమీపంలో అడ్మిషన్లు బాగా జరుగుతున్న కళాశాలల్లో విలీనం చేశారు. తక్కువ అడ్మిషన్లతో పాటు విద్యార్థుల నుంచి ఫీజు రాకపోవడం వల్ల అధ్యాపకుల వేతనాలు, కళాశాలల నిర్వహణ భారంగా మారవచ్చు. అలాగే విద్యార్థుల నాణ్యమైన బోధన అందకపోవచ్చు అనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పీయూ అధికారులు పేర్కొంటున్నారు.

బ్రిడ్జి పూర్తయ్యేదెన్నడో?



నత్తనడకన సాగుతున్న వంతెన నిర్మాణం

- నత్తనడకన సాగుతున్న పనులు
- నామమాత్రంగా ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు
- అంతర్గత రహదారులపైనే రాకపోకలు
- ట్రాఫిక్ సమస్యతో వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



అయిజ పాతబస్టాండ్‌లో నిలిచిన ఆర్టీసీ బస్సులు

అయిజ: పట్టణంలోని కొత్తబస్టాండ్ – పాతబస్టాండ్ మధ్యనున్న ప్రధాన రహదారిపై రూ.7కోట్లతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో మూడు రాష్ట్రాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పాత బస్టాండ్ – కొత్త బస్టాండ్ మధ్యనున్న పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి గత జనవరిలో ఆర్అండ్‌బీ అధికారులు టెండర్ నిర్వహించగా.. ఎల్ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ వారు దక్కించుకున్నారు. ఒక సంవత్సరంలో పనులు పూర్తి చేయాలని ఒప్పందం చేసుకున్నారు. గత జూలైలో బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించగా.. పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ఒకవైపు స్లాబ్ మాత్రమే పూర్తయింది. రెండవ వైపు స్లాబ్ పనులను పూర్తి చేయడంతో పాటు బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని పనులు వేగవంతం చేయాలని అధికారులు, పాలకులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తేవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

తప్పని ఇబ్బందులు..

బ్రిడ్జి నిర్మాణం సందర్భంగా అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ రోడ్డు రాకపోకలకు అనుకూలంగా లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మంత్రాలయానికి వెళ్లే ప్రజలు అయిజ మీదుగా వెళ్తారు. అంతేగాక రైతులు పండించిన ధాన్యం, పత్తి, జొన్నలను ఎమ్మిగనూరు, రాయచూరు మార్కెట్‌లకు తరలిస్తుంటారు. అదేవిధంగా మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రయోజనం కలిగిన రోడ్డుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారు.

చర్యలు చేపట్టని అధికారులు..

ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. వాహనాలు వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలి. అయితే ఆర్అండ్‌బీ అధికారులు అవేవి పట్టించుకోకుండా ఊరి చివరన మొక్కుబడిగా మట్టి రోడ్డు వేశారు. ఆ రోడ్డు సౌకర్యంగా లేకపోవడం, గమ్యానికి చేరుకోవడం ఆలస్యం అవుతుండటంతో వాహనదారులు ప్రభుత్వ ఆస్పత్రి ముందున్న చిన్న రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రయాణికులకు అదనపు ఖర్చు..

అయిజ–గద్వాల బస్సులు కొత్తబస్టాండ్‌కు వెళ్లకుండా పాతబస్టాండ్‌లోనే నిలిపివేస్తున్నారు. దీంతో ప్రయాణికులు కొత్తబస్టాండ్‌కు రాకపోకలు సాగించేందుకు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో ఒక్కొక్కరు అదనంగా రూ.20 ఖర్చు చేస్తున్నారు.

గంటల తరబడి ట్రాఫిక్ జాం..

డైవర్షన్ రోడ్డు పట్టణానికి దూరంగా ఉండటం.. వాహనాలు వెళ్తుంటే దుమ్ము రేగడంతో ప్రజలు రాకపోకలు సాగించడంలేదు. వివిధ కాలనీల మీదుగా వెళ్లేందుకు వాహనదారులు పోటీపడుతున్నారు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ జాం అవుతోంది. అర కిలోమీటర్ దూరం ప్రయాణం చేసేందుకు గంట సమయం పడుతుంది. అదేవిధంగా వాయు, శబ్ద కాలుష్యంతో ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికులకు సరైన మార్గం ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రయాణానికి అనుకూలమైన డైవర్షన్ రోడ్లను ఏర్పాటు చేయడంతో పాటు బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

పనుల్లో వేగం పెంచాలి



బ్రిడ్జి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలి. బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రోడ్డుపై పాత వంతెనను కూల్చి వేయకముందే ప్రజల సౌకర్యార్థం ప్రత్యామ్నాయ రోడ్డును సౌకర్యవంతంగా ఏర్పాటు చేసి ఉంటే బాగుండేది. మొక్కుబడిగా ఊరికి దూరంగా డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేయడంతో అవస్థలు పడుతున్నాం.
– శ్రీనివాసులు, అయిజ

ట్రాఫిక్ జాంతో ఇక్కట్లు



బ్రిడ్జి నిర్మాణంతో వాహనదారులు పశువుల ఆస్పత్రి ముందున్న రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ జాం కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. బ్రిడ్జి పనులను సకాలంలో పూర్తి చేస్తే బాగుంటుంది. కనీసం డైవర్షన్ రోడ్డుపై రోజు నీళ్లు చల్లి దుమ్ము రేగకుండా చేయాలి.
– యువ తేజేశ్వర్‌రెడ్డి, గుడుదొడ్డి

సామాన్యుడి జేబుకు చిల్లు



గద్వాల–అయిజ ఆర్టీసీ బస్సులు కొత్త బస్టాండ్‌కు రాకుండా పాత బస్టాండ్‌లోనే నిలిపివేస్తున్నారు. దీంతో బ్రిడ్జికి అటువైపు ఉన్న ప్రజలు గద్వాలకు వెళ్లేందుకు ఆటో ఎక్కాల్సి వస్తుంది. బ్రిడ్జికి ఇటువైపు ఉన్న ప్రజలు కర్నూలు, రాయిచూరు కొత్త బస్టాండ్‌కు వచ్చేందుకు ఆటోలను ఆశ్రయించి అదనపు ఖర్చు భరించాల్సి వస్తుంది.
– నాగరాజు, అయిజ

అధికారులకు విన్నవించాం



ఆర్అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ రోడ్లు ప్రతికూలంగా ఉండటంతో ప్రజలు రాకపోకలు సాగించడం లేదు. ఒకే రోడ్డుపై వాహనాలన్నీ వెళ్తుండటంతో ట్రాఫిక్ జాం అవుతోంది. ట్రాఫిక్ జాంను అరికట్టేందుకు పోలీసుల సహకారం తీసుకుంటాం. బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను కోరుతాం.
– నిత్యానంద్, మున్సిపల్ కమిషనర్, అయిజ

త్వరగా పూర్తిచేస్తాం..

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు నెలరోజుల సమయం మాత్రమే ఉంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరగా పనులు పూర్తి చేయాలని గుత్తేదారులను కోరాం. ఒక వైపు స్లాబ్ పనులు పూర్తి కాగా, క్యూరింగ్ కోసం సమయం పడుతుంది. క్యూరింగ్ పూర్తయ్యాక ఒకవైపు రాకపోకలు ప్రారంభిస్తాం.
– ప్రగతి, ఆర్అండ్‌బీ ఈఈ

నేడు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నేడు(శనివారం) ఘనంగా నిర్వహించనున్నట్లు జెడ్పీచైర్‌పర్సన్, కాంగ్రెస్ నాయకురాలు సరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీచైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయం నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించనున్నామని, అక్కడ వేడుకలను జరుపనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇదిలా ఉండగా.. గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ మంజుల శుక్రవారం జెడ్పీచైర్‌పర్సన్ సరితను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

‘ఉన్నతి, లక్ష్య’ పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ సిరాజుద్దీన్

ధరూరు: పాఠశాలల్లో ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ ఎండీ సరాజుద్దీన్ అన్నారు. శుక్రవారం మండల పరిదిలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు కార్యక్రమ ఫలితాలు విద్యార్థులకు చేరేలా కృషి చేయాలన్నారు. లక్ష్య సాధన దిశగా ప్రతి ఉపాధ్యాయుడు పని చేయాలని ఆదేశించారు. అనంతరం తరగతి గదిలో బోధనను పరిశీలించి పలు సూచనలు సలహాలు చేశారు. పాఠశాల విద్యార్థులతో సంభాషించి పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. అదే విధంగా బేస్‌లైన్ టెస్టు మార్కులను విధిగా యాప్‌లో ఎంటర్ చేసేవిధంగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా సెక్టోరియల్ అధికారి హంపయ్య, పాఠశాల ప్రధానెపాధ్యాయుడు నారాయణ రావు, కాంప్లెక్స్ సెక్రటరీ ప్రతాప్, ఆయా మండలాల సోసల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళామణులకు ఉచిత ప్రయాణం

- నేటినుంచి పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సదుపాయం
- రీజియన్‌లో ప్రతిరోజు 80 వేల మహిళల రాకపోకలు



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల హామీలపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగా మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి అమలుకానుంది. వయస్సుతో సంబంధం లేకుండా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా రాష్ట్ర పరిధిలో ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చు.

రీజియన్ పరిధిలో..

మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ 10 డిపోల్లోని 845 బస్సుల్లో ప్రతిరోజు 2.50 లక్షల మంది ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. వీరిలో దాదాపు 75–80 వేల మంది మహిళలు రాకపోకలు సాగిస్తారు. రీజియన్‌లో పల్లె వెలుగు 467, ఎక్స్‌ప్రెస్ 263 బస్సులు ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి బాలికలు, మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. ప్రయాణ సమయంలో మహిళలు స్థానికత ధ్రువీకరణ కోసం గుర్తింపు కార్డులను కండక్టర్లకు చూపించాలి. అయితే ఆర్టీసీ బస్సుల్లో మధ్యతరగతి ప్రజలే ఎక్కువగా ప్రయాణం చేస్తుంటారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం లభించడంతో మధ్య తరగతి ప్రజలకు కొంత ప్రయాణ ఆర్థికభారం తగ్గనుంది.

మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో..

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మహబూబ్‌నగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఏఎస్పీ రాములు, డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి ప్రారంభించనున్నారు.

హామీని నిలబెట్టుకున్నాం..



కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందంటే కచ్చితంగా అమలు చేసి తీరుతుంది. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ప్రధానమైనది మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభమవుతుండడం సంతోషంగా ఉంది.
– బెక్కరి అనిత, కాంగ్రెస్ జిల్లా నాయకురాలు, మహబూబ్‌నగర్

ఆర్థికభారం తగ్గుతుంది..



ఆర్టీసీ బస్సుల్లో మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం చేయడానికి అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. దీంతో మధ్య తరగతి ప్రజలకు కొంతమేర ఆర్థికభారం తగ్గుతుంది.
– త్రివేణి, మహబూబ్‌నగర్

పీయూలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి భూమిపూజ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ మేరకు పీయూలోని ఫార్మసీ కళాశాల వెనుక ఉన్న మూడు ఎకరాల స్థలంలో గతంలోనే చదును చేసి ఉంచారు. ఈ మేరకు ఇటీవల రూ.9.50 కోట్లతో నిర్మాణానికి అనుమతులు రాగా, ట్రాక్ నిర్మాణం కోసం ప్రత్యేకంగా శుక్రవారం మార్కింగ్ చేయగా అందులో భవిష్యత్‌లో నిర్మించే పెవిలియన్, మరుగుదొడ్లు, డ్రస్సింగ్ రూం.. తదితర అంశాలపై పీయూ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భవిష్యత్ అవసరాల దృష్టిలో ఉంచుకుని ట్రాక్‌ను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని, మార్చి, ఏప్రిల్ లోగా పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని అథ్లెటిక్స్ జాతీయస్థాయి పోటీలకు సిద్ధమయ్యే క్రీడాకారులకు ఈ ట్రాక్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



ట్రాక్ నిర్మాణంపై సూచనలు చేస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, ఇంజనీరింగ్ అధికారులు

క్లుప్తంగా

వ్యవసాయ పొలంలో రైతు దారుణ హత్య

జడ్చర్ల: వ్యవసాయం పొలం దగ్గరకు వెళ్లి వస్తానంటూ ఇంటి దగ్గర చెప్పి వెళ్లిన వ్యక్తి తన పొలం వద్దే దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలోని ఆలూరులో చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన గోపే మల్లేష్(34) వ్యవసాయంతోపాటు మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అర్ధ రాత్రి దాటినా ఇంటికి రాకపోవడంతో తెల్లవారుజామున కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూశారు. అక్కడ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండడంతో బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. తల, ముఖంపై తీవ్ర గాయాలు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. బలమైన మారణాయుధంతో దాడి చేసి పథకం ప్రకారం హత్య చేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అక్రమ సంబంధం నేపథ్యంలో హత్య జరిగిందా.. మరేమైన కారణాలు ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మల్లేష్‌కు భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి బాదేపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం?

వనపర్తి: జిల్లాకేంద్రంలోని ఓ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ కుటుంబ సమస్యలతో శుక్రవారం తన నివాసంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పోలీస్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న సదరు కానిస్టేబుల్ పురుగు మందు తాగుతుండగా.. గమనించిన కుటుంబసభ్యులు, సహచర కానిస్టేబుల్స్ ఆయనను నివారించి.. వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేసి ప్రమాదమేమి లేదని చెప్పారు.

కారులో లిఫ్ట్ ఇచ్చి.. బంగారు గొలుసు చోరీ

కొత్తకోట రూరల్: ఓ మహిళకు కారులో లిఫ్ట్ ఇచ్చిన గుర్తు తెలియని దుండగులు.. ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును చోరీ చేశారు. ఈ ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల మేరకు.. కొత్తకోట మండలం రాయిణిపేటకు చెందిన సంయుక్త అనే 55ఏళ్ల మహిళ గ్రామం నుంచి కొత్తకోటకు వచ్చేందుకు ఎన్‌హెచ్ 44 వద్ద నిల్చుంది. కర్నూల్ వైపు నుంచి కారులో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఆమెకు లిఫ్ట్ ఇచ్చారు. నాలుగు కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత కొత్తకోట బైపాస్ మదర్ థెరిస్సా జంక్షన్ సమీపంలోకి రాగానే.. మీ స్టేజీ వచ్చిందని ఆమెను దింపేశారు. కారు దిగిన సదరు మహిళ.. మెడలో ఉండాల్సిన రెండు తులాల బంగారు గొలుసు లేకపోవడంతో లబోదిబోమంటూ అటుగా వెళ్తున్న వాహనదారులకు జరిగిన విషయాన్ని చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరికొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు



కేటీదొడ్డి: కొందరు రైతులు వ్యవసాయ పొలాల్లో వరికొయ్యలకు నిప్పు పెడుతున్నారు. ఇలా చేయడం వల్ల భూసారం దెబ్బతింటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరికొయ్యలకు నిప్పు పెట్టడం వల్ల భూసారం దెబ్బతింటుందని, అధిక మోతాదులో రసాయన ఎరువులను వినియోగించడం వల్ల నష్టం వాటిల్లుతుందని పేర్కొంటున్నారు. వరికొయ్యలను కాల్చకుండా పొలంలోనే కలియదున్నాలని సూచిస్తున్నారు.

సొంతింటి కల.. సాకారమయ్యేనా?



అమరచింతలోని దుంపాయికుంటలో వేసిన గుడిసెలు

దంపాయికుంటలో గుడిసెల్లోనే నివాసం

- రాత్రి వేళల్లో విష పురుగులతో సహవాసం
- ఇంటి స్థలాలు చూపాలని 14 నెలలుగా పోరాటం
- కొత్త ప్రభుత్వంలోనైనా పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని వేడుకోలు



గుడిసెలో నివాసముంటున్న కుటుంబం

అమరచింత: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారింది పేదల పరిస్థితి. అమరచింత పట్టణంలో పేదలకు ఇంటి స్థలాలు కేటాయిస్తూ పట్టాలిచ్చిన ప్రభుత్వం.. స్థలం చూపకపోవడంతో సొంతింటి కల కలగానే మారింది. సంబంధిత స్థలంలో పేదలు గుడిసెలు వేసుకొని 14 నెలలుగా పోరాడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. 1997లో పేదలకు ఇంటి స్థలాలు కేటాయించేందుకు గాను అప్పటి ప్రభుత్వం అమరచింత పట్టణంలోని దుంపాయికుంటలో సర్వే నంబర్ 586, 587లలో 14 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. అందులో సుమారు 350 మందికిపైగా పట్టాలిచ్చిన అధికారులు.. స్థలం చూపలేదు. తమ స్థలం ఎక్కడుందో చూపాలని పట్టాదారులు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో తమకు న్యాయం చేయాలని ఆందోళనకు సిద్ధమయ్యారు. వీరికి సీపీఎం పార్టీ మద్దతు ఇవ్వడంతో దుంపాయికుంటలో 2022 సెప్టెంబర్ 9న సంబంధిత స్థలంలో గుడిసెలు వేసుకొని పోరాటం చేపట్టారు. అప్పటి నుంచి అక్కడే గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించకపోవడంతో ఆందోళన కొనసాగిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు.

సర్వేలకే పరిమితం..

దుంపాయికుంటలో ఇంటి స్థలాల కేటాయింపు సర్వేకే పరిమితమైంది. పేదలకు ఇచ్చిన పట్టాల ఆధారంగా అధికారులు నెలకోసారి సర్వే అంటూ కాలయాపన చేస్తున్నారు. త్వరగా సర్వే పూర్తి చేసి నిజమైన లబ్ధిదారుల జాబితా ఇవ్వాలని నాలుగు నెలల కిందట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్య వైఖరితో సమస్య సమస్యగానే మిగిలిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దె ఇంట్లో ఉండేవాళ్లం..



సొంతిల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో బతికే వాళ్లం. ఇంటిస్థలం పట్టా ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా స్థలం చూపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇంటి జాగా చూపాలని ఇక్కడే గుడిసె వేసుకొని జీవిస్తున్నాను. అధికారులు స్పందించి ఇంటి స్థలం చూపాలి.

– కవిత, అమరచింత

గుడిసెలోనే నివాసముంటున్నాం..



మాకు సొంత స్థలం లేదు. 14 నెలలుగా గుడిసెలోనే నివాసముంటున్నాం. ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలం పట్టా ప్రకారం స్థలం కేటాయించి, డబుల్‌బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలి. గత ప్రభుత్వం మా గోడును ఏమాత్రం పట్టించుకోలేదు.

– శాంతమ్మ, అమరచింత

అవస్థలు పడుతున్నాం..



నివాస స్థలం లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాం. నెలనెలా ఇంటి అద్దె చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం స్థలం కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి ఆదుకోవాలి.

– సత్యమ్మ, అమరచింత

కొత్త ప్రభుత్వంపై ఆశలు..

ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని పట్టాదారులు కొన్నేళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. తమకు కేటాయించిన స్థలంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పట్టాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించి, పక్కాగృహాలు నిర్మించాలని ఇవ్వాలని వేడుకుంటున్నారు.

‘ఉన్నతి’ విధానంతో మెరుగైన ఫలితాలు



కోస్గి పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయలక్ష్మి

ఆర్జేడీ విజయలక్ష్మి

కోస్గి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు విద్యాశాఖ చేపట్టిన ‘ఉన్నతి’ బోధనాభ్యాస విధానంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆర్జేడీ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం కోస్గి, గుండుమాల్, మద్దూర్ పాఠశాలలతో పాటు పెదిరిపాడ్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉన్నతి, ఎఫ్ఎల్ఎన్ అమలు తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులతో బోధనాభ్యాస ప్రక్రియలను వినియోగిస్తూ బోధన చేయించారు. అదేవిధంగా పలు రికార్డులతో పాటు మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించారు. అనంతరం ఆర్జేడీ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచడమే లక్ష్యంగా బోధన సాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇకపై ప్రతి వారం పాఠశాలలను తాను స్వయంగా తనిఖీ చేస్తానని, జిల్లా పరిశీలన బృందాలు సైతం పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని సమీక్షించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్ ఘని, సెక్టోరియల్ అధికారి విద్యాసాగర్, ఎస్ఆర్పీ ఈడీ మధుసూదన్‌రెడ్డి, డీఆర్పీ వీరు మల్లేష్ పాల్గొన్నారు.

మక్తల్‌కు చేరిన పాదయాత్ర



మక్తల్: అయోధ్య రామమందిరం ప్రారంభం నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన 26 ఏళ్ల సంజయ్ అయోధ్య నుంచి తమిళనాడులోని రామేశ్వరం వరకు 3 నెలల కిందట పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్ర శుక్రవారం మక్తల్‌కు చేరుకోగా పట్టణానికి చెందిన హిందూ ధార్మిక సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పాదయాత్ర విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో పూజారి ప్రణీశ్‌చారి, అరవింద్‌చారి, భీంరెడ్డి, రమేశ్, మంజునాథ్, శ్రీకాంత్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రి సీజ్



అచ్చంపేటలో ప్రైవేటు ఆస్పత్రిని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

అచ్చంపేట రూరల్: అచ్చంపేట పట్టణంలోని చరితసాయి చిన్నపిల్లల ఆస్పత్రిని వైద్యాధికారులు సీజ్ చేశారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్‌తో పాటు సిబ్బంది ప్రైవేటు ఆస్పత్రిని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతి పత్రాలను పరిశీలించగా.. డాక్టర్ అప్పారావు పేరున 2021 డిసెంబర్ వరకు అనుమతి ఉందని, తదుపరి రెన్యువల్ చేసుకోకుండా అక్రమంగా ఆస్పత్రిని నడిపిస్తున్నారని గుర్తించి సీజ్ చేసినట్లు డాక్టర్ రవికుమార్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆస్పత్రులను నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ (చిన్నపిల్లల పర్యవేక్షణ) సెంటర్‌ను తనిఖీ చేశారు. విధులను నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. పుట్టిన 24 గంటల లోపు పిల్లలకు జీరో డోసు టీకాలు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది అశోక్ ప్రసాద్, శ్రీనివాసులు, మాణిక్యమ్మ, పాషా పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్



పశుగ్రాసాన్ని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తీగలు తెగిపడి గడ్డి దగ్ధం

గట్టు: మండల పరిధిలోని మాచర్ల గ్రామ శివారులో శుక్రవారం మధ్యాహ్నం పశుగ్రాసాన్ని తీసుకెళ్తున్న ట్రాక్టర్ విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్‌తో సహా పశుగ్రాసం అగ్నికి ఆహుతైంది. అయిజ మండలం ఎక్లాస్‌పురానికి చెందిన రైతులు గంగిమాన్‌దొడ్డికి చెందిన నర్సింహులు ట్రాక్టర్‌ను అద్దెకు మాట్లాడుకుని మాచర్ల చెరువు కింద వరి గడ్డిని తీసుకరావడానికి వెళ్లారు. అయితే వరి గడ్డిని ట్రాక్టర్‌లో లోడు చేసిన రైతులు ట్రాక్టర్‌ను కాల్వ వెంట తీసుకెళ్తున్నారు. దారి మధ్యలో కాల్వ పక్కన రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి వరి గడ్డి లోడుతో ఉన్న ట్రాక్టర్ తగిలింది. విద్యుత్ స్తంభం విరిగి వైర్లతో సహా ట్రాక్టర్‌పై పడింది. దీంతో నిప్పు రవ్వలు రేగడంతో వరి గడ్డికి నిప్పంటుకుంది. ట్రాక్టర్ డ్రైవర్‌తో సహా మరో ముగ్గురు రైతులు ట్రాక్టర్ పైనుంచి కిందకు దూకి ప్రాణాలను రక్షించుకున్నారు. కాల్వలోని నీటితో మంటలను కొంత వరకు ఆర్పేందుకు చుట్టు పక్కల రైతులు ప్రయత్నించారు. గద్వాల నుంచి అగ్నిమాపక వాహనం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేసింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.9 లక్షల దాకా ఆస్తి నష్టం సంభవించినట్లు రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు హనుమంతునాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ పదవికి కసిరెడ్డి రాజీనామా



వెల్దండ: ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి తన పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. కసిరెడ్డి నారాయణరెడ్డి 2021 డిసెంబర్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా రెండోసారిగా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికై .. జనవరిలో ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి ఆచారిపై 5,248 మెజార్టీతో గెలుపొందారు. దీంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఆమోదించినట్లు తెలిసింది.

బీచుపల్లిలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: ఉత్పన్న ఏకాదశిని పురస్కరించుకొని బీచుపల్లిలోని ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో ప్రధాన అర్చకు లు అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటివి జరిపించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆంజనేయస్వామి, శివాలయం, సరస్వతిదేవి ఆలయాలను దర్శించుకొని ధ్వజస్తంభం ఎదుట కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలోనూ కుంకుమార్చన పూజలను వైభవంగా నిర్వహించారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నారాయణపేట రూరల్: కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ కోర్టులో న్యాయవాదిగా ఉన్న పాటిల్‌ను హత్య చేయడాన్ని నారాయణపేట బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, న్యాయం కోసం పోరాటం చేస్తుంటే హత్యలకు పాల్పడటం సరికాదన్నారు. పాటిల్ ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో దామోదర్‌గౌడ్, చెన్నారెడ్డి, భీంరెడ్డి, లక్ష్మిపతి, బాలప్ప, మల్లికార్జున్, మధన్, రాజవర్ధన్‌రెడ్డి, సీతారామారావు పాల్గొన్నారు.

రోడ్డుపై మొక్కలు కోస్తుండగా..

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ






ప్రమాదానికి గురైన ట్రాక్టర్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ

నలుగురికి గాయాలు

కొత్తకోట రూరల్: మొక్కల కోసం వెళ్లిన ట్రాక్టర్‌ను లారీ ఢీట్టడంతో నలుగురికి గాయాలైన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట ఎన్‌హెచ్44 పాలెం బైపాస్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునాథ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సత్యహళ్లి గ్రామ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా గన్నేరు మొక్కలు నాటాలనుకున్నారు. దీంతో మొక్కలు తీసుకొచ్చేందుకు గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను డ్రైవర్ సాయికుమార్ తీసుకుని, ఇద్దరు గ్రామ పంచాయతీ సిబ్బంది, మరో ఇద్దరు కూలీలను ట్రాక్టర్‌లో ఎక్కించుకుని కొత్తకోట సమీపంలో పాలెం బైపాస్ వద్దకు వెళ్లాడు. అక్కడ రోడ్డుపై గన్నేరు మొక్కలు కట్ చేస్తున్న క్రమంలో రోడ్డుపై ఉన్న ట్రాక్టర్‌ను హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్టర్‌పై కూర్చున్న డ్రైవర్ సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో కుర్మన్న, శ్రావణి, సంధ్య, మన్నెం ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

నిర్వాసితులకు అందని పరిహారం



ఆర్అండ్ఆర్ సెంటర్లకు మంజూరైన ప్రొసీడింగ్స్

మక్తల్: నియోజకవర్గంలోని సంగంబండ రిజర్వాయర్ ముంపు బాధితులకు పరిహారం అందడం లేదు. రిజర్వాయర్‌లో ఊట్కూర్ మండలం గార్లపల్లి గ్రామం ముంపునకు గురవగా.. పరిహారం ఇవ్వలేదని, ఇతరత్రా సమస్యలు వేధిస్తున్నాయని గతంలో ప్రజలు అధికారులు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. అయితే ఇటీవల మాగనూర్ మండలం ఉజ్జెల్లికి రూ.13,34,59,200, మక్తల్ మండలం సంగంబండకు రూ.11.98 కోట్లు, ఊట్కూరు మండలం గార్లపల్లికి రూ.1.19 కోట్లు ఆర్అండ్ఆర్ నిర్వాసితులకు ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే మాగనూర్ గ్రామానికి ఆర్ఆర్ సెంటర్‌కు జీఓ 295 నుంచి ఇరిగేషన్ అండ్ ఆర్ఆర్ డిపార్టుమెంట్ ద్వారా మూడు నెలల క్రితమే డబ్బులు మంజూరు చేసినట్లు ప్రొసీడింగ్ విడుదల చేసింది. అయితే బాధితులకు మాత్రం ఇప్పటికీ పరిహారం అందకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పరిహారం ఇప్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పసుపు అట్టలతో సమగ్ర సస్యరక్షణ

పాడి-పంట



పంటలో ఏర్పాటు చేసిన పసుపురంగు అట్టలు

అలంపూర్: పంటల సాగులో పురుగు మందుల వినియోగం విపరీతంగా పెరిగింది. మన దేశంలో 1955లో 200 టన్నులు ఉండగా ప్రస్తుతం 1.50 లక్షల టన్నులకుపైగా పురుగు మందులు వినియోగిస్తున్నట్లు వ్యవసాయ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. భారత్‌లో హెక్టారుకు సగటున 0.5 కిలోలు, అమెరికాలో 1.5 కిలోలు, ఐరోపాలో 2.5 కిలోలు, జపాన్‌లో కిలో పురుగు మందులు వాడుతున్నట్లు తెలుస్తోంది. సమగ్ర సస్యరక్షణ చర్యలతో పురుగు మందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచిస్తున్నారు. ఇందుకుగాను సులభ పద్ధతులను వివరించారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులు

- సాగు పద్ధతి
- యాంత్రిక పద్ధతి
- జీవ నియంత్రణ పద్ధతి
- పర్యావరణహిత పురుగు మందులు

యాంత్రిక పద్ధతిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు ముఖ్య పాత్ర పోషిస్తాయి.

అటువంటి వాటిలో కొన్ని..

- నారు మొక్కకు చివరలు తుంచి వేయడం
- చీడపీడలు ఆశించిన భాగాన్ని తుంచి వేయడం
- పక్షి స్థావరాలు ఏర్పాటు చేయడం
- దీపపు ఎరల ఏర్పాటు
- శత్రు గుడ్ల సముదాయాన్ని సేకరించి నాశనం చేయడం
- రాత్రిళ్లు గుడ్లపై మంటలు వేయడం

పసుపుపచ్చ (జిగురు పూసిన) అట్టల పాత్ర..

టమాట, మిరప తదితర పంటల్లో తెల్ల దోమ, పచ్చ దోమ, రసం పీల్చు, తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. మిరప పంటకు తెల్ల దోమ సోకడంతో జెమిని వైరస్, కుకుంబర్ మొజాయిన్ వైరస్ పెరిగి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఏ రకమైన పురుగునైనా ఆకర్షించే గుణం పసుపుపచ్చ రంగు అట్టలకు ఉంటుంది. ఈ అట్టలను కట్టెలకు ఏర్పాటుచేసి సాళ్ల వెంట క్రమపద్ధతిలో అమర్చి వాటికి జిగురు లేదా గ్రీసు పూస్తే తెల్ల, పచ్చ దోమతో పాటు ఎర్ర నల్లి, తామర పురుగు అంటుకొని చనిపోతాయి. దీనితో ముడత తెగులు పూర్తిగా తగ్గిపోతుంది. పురుగు మందులు వాడకుండా అతి తక్కువ ఖర్చుతో రసం పీల్చే పురుగును నియంత్రించే ఈ మ్యాజిక్ అట్టలు ఎకరాకు 20 నుంచి 30 వరకు అమర్చుకోవాలి. దీనికి రూ.వెయ్యి వరకు ఖర్చవుతుంది.

అండగా నేనున్నా..

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు ఏపీ సీఎం జగన్ ఓదార్పు


సాక్షి, తిరుపతి: అధైర్యపడొద్దు.. అండగా నేనున్నానంటూ తుపాను బాధితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం తిరుపతి, బాపట్ల జిల్లాల్లో పర్యటించి బాధితులను స్వయంగా కలుసుకుని పరామర్శించారు. పంట చేతికొచ్చే సమయంలో రైతన్నకు జరిగిన అపార నష్టాన్ని చూసి చలించిపోయారు. ఖరీఫ్ సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని, పంట నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీతో శనగ విత్తనాలను సరఫరా చేస్తామని తెలిపారు. తిరుపతి నుంచి మొదలుపెడితే సుదీర్ఘ కోస్తా తీరం మొత్తాన్ని తుపాన్ తీవ్రంగా దెబ్బ తీసిందని, ఎప్పుడూ చూడని వర్షం నాలుగు రోజుల్లోనే కురవడంతో పొలాల్లో నీరు నిలిచిపోయి రైతన్నలకు అపార నష్టం వాట్లిందన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తీసుకొచ్చిన వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అందరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విపత్తు వేళ అధికార యంత్రాంగం వెంటనే అప్రమత్తమై బాధిత ప్రాంతాల్లో విద్యుత్తు పునరుద్ధరణకు చర్యలు తీసుకుందన్నారు. గన్నవరం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సీఎం జగన్ తొలుత తిరుపతి, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని తుపాను బాధిత ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం కోట మండలం విద్యానగర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామానికి చేరుకుని కోతకు గురైన స్వర్ణముఖి నది, వరి పంటలను పరిశీలించారు. స్వర్ణముఖి కోతకు గురి కావటానికి కారణాలను ఆరా తీశారు. బాలిరెడ్డిపాళెంలో తుపాను బాధితులతో నేరుగా మాట్లాడారు.



బాపట్ల జిల్లా పాతనందాయపాలెంలో వర్షానికి తడిసిన వరి కంకులను పరిశీలిస్తూ రైతులతో మాట్లాడుతున్న సీఎం జగన్

బాబు కోర్టు ధిక్కారం

- బెయిల్ షరతులు ఉల్లంఘించి మరీ ఉపన్యాసం
- తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో తన కేసు గురించి ప్రస్తావన
- స్కిల్ స్కాం గురించి మాట్లాడకూడదని చెప్పిన హైకోర్టు, సుప్రీంకోర్టు
- కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ప్రసంగం
- తప్పు చేయకుండా తనను జైల్లో పెట్టారంటూ వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి బెయిల్‌పై బయట ఉన్న చంద్రబాబు బెయిల్ షరతులను యథేచ్ఛగా ఉల్లంఘించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనకు వెళ్లి అక్కడ తన అరెస్టు, జైలు గురించి ప్రసంగించి కోర్టు ఆదేశాలను ధిక్కరించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా తన అరెస్టు గురించి మాట్లాడి కోర్టులంటే తనకు లెక్కలేదన్నట్లుగా వ్యవహరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబుకు అక్టోబర్ 31న హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసు గురించి ఎక్కడా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మాట్లాడకూడదని హైకోర్టు బెయిల్ ఆర్డర్‌లో స్పష్టంగా పేర్కొంది. కేసులోని విషయాల గురించి బయట ఎక్కడా చర్చించవద్దని స్పష్టంచేసింది. అలాగే, హైకోర్టు ఆదేశాలను చంద్రబాబు తప్పకుండా పాటించాలని, స్కిల్ డెవలప్‌మెంట్ కేసు గురించి ఎక్కడా మాట్లాడకూడదని సుప్రీంకోర్టు కూడా ఆదేశించింది. అయితే, చంద్రబాబు మాత్రం వీటిని బహిరంగంగా ఉల్లంఘించారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండలం అత్తోటలో శుక్రవారం తుపాను బాధితులను పరామర్శించి అక్కడ రాజకీయ ప్రసంగం చేశారు. తుపాను దెబ్బకు అన్ని విధాలుగా నష్టపోయి రైతులు ఆందోళనలో ఉంటే చంద్రబాబు మాత్రం అక్కడకు వెళ్లి తనను అన్యాయంగా అరెస్టు చేశారని, ఏ తప్పు చేయకుండా జైల్లో పెట్టారంటూ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు గురించి మాట్లాడారు.

45 ఏళ్లుగా టెక్నికల్‌గా, లీగల్‌గా తప్పుచేయలేదు..

తనలాంటి వాళ్లను కూడా జైల్లో పెట్టేయగలుగుతున్నారని, బాధ కలగదా అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. 45 ఏళ్లుగా తానెక్కడా ఒక్క తప్పు కూడా చేయలేదని, టెక్నికల్‌గా, లీగల్‌గా ఒక్క తప్పూ చేయకుండా ఉన్నానని, అలాంటి తనను జైల్లో పెట్టారని చెప్పారు. ఎలాంటి తప్పు కూడా చేయకుండా ఉన్న పళంగా కేసు బుక్‌చేసి లోపలేశాడని సీఎంను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాను కూడా మనిషినేనని, తనకూ బాధలు ఉంటాయని, తనకూ మనసు ఉంటుందని, చేయని తప్పుకి శిక్ష అనుభవిస్తే ఎలా ఉంటుందంటూ ప్రజల సానుభూతి కోసం ఆయన ప్రయత్నించారు. తన కోసం 52 రోజులుగా అందరూ వీరోచితంగా పోరాడారని, తనను అరెస్టుచేస్తే అందరినీ బెదిరించవచ్చనే ఉద్దేశంతో సీఎం ఇలా చేసినట్లు చంద్రబాబు పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

న్యాయకోవిదుల విస్మయం..

బెయిల్ షరతులను ఉల్లంఘించి తాను అరెస్టయిన కేసు గురించి చంద్రబాబు మాట్లాడడంపై న్యాయకోవిదులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. బెయిల్ పొందినప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకుంటానని చెప్పి బయటకు వచ్చాక ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో అందుకు సంబంధించిన విషయాల గురించి కాకుండా తాను జైలుపాలవడం, కేసుల గురించి మాట్లాడడం ఏమిటనే ప్రశ్నలు సాధారణ ప్రజానీకం నుంచి వినిపిస్తున్నాయి. ఇక అనారోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్‌పై బయటకు వచ్చినప్పుడు కూడా రాజమహేంద్రవరం నుంచి విజయవాడకు గంటల తరబడి ర్యాలీ చేసుకుంటూ వచ్చి ఆయన కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. తనకు ఆరోగ్యం బాగోలేదని బెయిల్ తీసుకుని భారీఎత్తున ర్యాలీలు చేయడంపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే, విజయవాడ ఏసీబీ కోర్టు ఈ కేసులోనే ఆయనకు రిమాండ్ విధించినప్పుడు సైతం న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలు విపరీతంగా కామెంట్లు చేశారు. సోషల్ మీడియాలో న్యాయమూర్తిని అసభ్యపదజాలంతో దూషిస్తూ పోస్టులు పెట్టారు. చంద్రబాబు జైల్లో ఉన్నన్ని రోజులు ఆయన కుమారుడు లోకేశ్, ఇతర నాయకులు కోర్టులను మేనేజ్ చేశారంటూ న్యాయ వ్యవస్థను కించపరిచేలా మాట్లాడారు. చివరికి అదే న్యాయ వ్యవస్థ నుంచి చంద్రబాబు బెయిల్ పొంది బయటకొచ్చారు. ఇప్పుడు ఆ కోర్టు ఆదేశాలనే ధిక్కరిస్తూ స్కిల్ కుంభకోణం గురించి రాజకీయ ఉపన్యాసం చేయడం గమనార్హం.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్‌బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ కేసులో ప్రతివాది కౌంటరు దాఖలు చేయలేదని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. స్కిల్ కుంభకోణం కేసులో పీడీ చట్టం సెక్షన్ 17ఏ పై తీర్పు ఇంకా వెలువరించలేదని చంద్రబాబు తరపు న్యాయవాది హరీష్ సాల్వే ధర్మాసనానికి తెలిపారు. తీర్పు ఇచ్చేలా ఉంటే వాయిదా వేయాలని, లేదంటే తదుపరి విచారణ తేదీ తెలపాలని ధర్మాసనాన్ని కోరారు. కౌంటరు దాఖలు చేస్తామని ధర్మాసనానికి తెలిపారు. అయితే, తదుపరి విచారణ జనవరి మూడో వారంలో చేపడతామని ధర్మాసనం పేర్కొంది. తేదీ ఖరారు చేయాలని హరీష్ సాల్వే కోరగా.. జనవరి 19కి వాయిదా వేస్తున్నామని, అప్పటి లోగా కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రిజాయిండర్ దాఖలు చేయాలని ధర్మాసనం పేర్కొంది.

ఏపీలో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల

- 81 పోస్టులు భర్తీ చేయనున్న ఏపీపీఎస్సీ
- జనవరి 1 నుంచి 21 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- మార్చి 17న ఆఫ్‌లైన్‌లో ప్రిలిమ్స్ నిర్వహణ
- ఈ నెలాఖరుకు మరిన్ని నోటిఫికేషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్థాయిలో అత్యున్నత సర్వీసులైన గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 81 గ్రూప్-1 పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. గురువారం 897 గ్రూప్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన సర్వీస్ కమిషన్ తాజాగా గ్రూప్-1 పోస్టులకుసైతం నోటిఫికేషన్‌జారీ చేసింది. అభ్యర్థులు తమ వన్ టైమ్ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ (ఓటీపీఆర్) ఆధారంగా జనవరి 1 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. కొత్త అభ్యర్థులు తొలుత కమిషన్ వెబ్‌సైట్‌లో తమ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకుని, ఓటీపీఆర్‌తో దరఖాస్తు చేసుకోవాలి. ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో మార్చి 17న ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు సర్వీస్ కమిషన్ పేర్కొంది. డిస్క్రిప్టివ్ విధానంలో జరిగే మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనుంది. కమిషన్ ప్రకటించిన గ్రూప్-1 విభాగంలో 9 డిప్యూటీ కలెక్టర్లు, 18 అసిస్టెంట్ ట్యాక్స్ కమిషనర్స్ పోస్టులు, 26 డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్స్, ఆర్టీవో, గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్స్, జిల్లా బీసీ సంక్షేమ వంటి ఉన్నత స్థాయి పోస్టులు ఉన్నాయి. గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో రెండు పేపర్లు సైతం ఆఫ్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ విధానంలోనే నిర్వహించనున్నారు. మొత్తం పోస్టులు, వేతనం, అర్హతలతో కూడిన పూర్తి సమాచారం కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో ఉంచినట్టు కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు. కాగా, ఇప్పటికే ఆర్థికశాఖ అనుమతినిచ్చిన మరికొన్ని పోస్టులకు ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్లు ఇచ్చేందుకు ఏపీపీఎస్సీ ప్రణాళిక సిద్ధం చేసింది.

వివాదరహితంగా పోస్టుల భర్తీ

గతంలో ఉండే అనేక న్యాయపరమైన వివాదాలను, చిక్కులను పరిష్కరించి ప్రభుత్వం సర్వీస్ కమిషన్‌లో సంస్కరణలు తీసుకొచ్చింది. దాంతో గతేడాది ఏపీపీఎస్సీ ఇచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్ ద్వారా ఎలాంటి వివాదాలకు తావులేకుండా 11 నెలల కాలంలో పూర్తి పారదర్శకంగా మెయిన్స్, ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేసింది. గ్రూప్-1 పరీక్షలు, మూల్యాంకనం, అభ్యర్థుల ఎంపిక సమర్థవంతంగా నిర్వహించి, హేతుబద్ధంగా అభ్యర్థుల వాస్తవిక నైపుణ్యాన్ని అంచనా వేసి ఎంపిక చేశారు. ఈ నియామకాలు అతి తక్కువ సమయంలోనే కమిషన్ పూర్తి చేసింది. ఇదే తరహాలో ఇప్పుడు ప్రకటించిన నోటిఫికేషన్లలో ఇచ్చిన పోస్టులు సైతం సమర్థవంతంగా, సత్వరం భర్తీ చేసేందుకు కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది.

వైద్యశాఖలో 170 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో ఉండే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 144, విశాఖపట్నంలోని విమ్స్‌లో 26 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ ద్వారా శాశ్వత, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పోస్టుల భర్తీ చేయనున్నట్టు బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బోధనాస్పత్రుల్లో వివిధ స్పెషాలిటీలలో ఖాళీగా ఉన్న 144 పోస్టుల్ని శాశ్వత ప్రాతిపదికన (డైరెక్ట్/లేటరల్) భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి ఈనెల 18, 20 తేదీల్లో విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాక్‌ఇన్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తారు. ఇక విమ్స్‌లో 26 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయడం కోసం ఈనెల 15న విశాఖపట్నంలోని విమ్స్‌లోనే వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ చేపట్టనున్నారు. అర్హులైన అభ్యర్థులు ఆయా తేదీల్లో నిర్ణీత ప్రదేశాలకు స్వయంగా హాజరు కావాల్సి ఉంటుంది. అర్హత, ఇతర నియమనిబంధనలతో కూడిన సమగ్ర నోటిఫికేషన్‌ను https://dme.ap.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉంచకుండా సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

నలబెల్లం, పటిక పట్టివేత

- డీసీఎం సీజ్.. ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన నల్ల బెల్లం, పటికతో ఎక్సైజ్ పోలీసులు, నిందితులు

బల్మూర్: మండలంలోని జినుకుంట స్టేజీ వద్ద గురువారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. లింగాలకు చెందిన ప్రసాద్ కొంతకాలంగా నాగర్‌కర్నూల్ నుంచి అచ్చంపేటకు నల్లబెల్లం, పటిక తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు.. గురువారం రాత్రి వాహన తనిఖీ చేపట్టి డీసీఎంలో తరలిస్తున్న 60 క్వింటాళ్ల నల్లబెల్లం, 250 కిలోల పటికను స్వాధీనం చేసుకొని డీసీఎంను సీజ్ చేసినట్లు వివరించారు. అక్రమ వ్యాపారం చేస్తున్న ప్రసాద్, రమణను అదుపులోకి తీసుకున్నామన్నారు. తనిఖీల్లో సీఐతో పాటు ఎక్సైజ్ ఎస్ఐ సతీష్, బాలరాజు, రవి ఆపల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ దాడుల్లో నిషేధిత గుట్కాల పట్టివేత

దామరగిద్ద: మండల కేంద్రం మీదుగా మద్దూర్‌కు యథేచ్ఛగా తరలిస్తున్న నిషేధిత గుట్కా పాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పథకం ప్రకారం పట్టుకుని సీజ్ చేసినట్లు ఏఎస్ఐ అరుణ్ తెలిపారు. ఉట్కూర్ ఖతల్ హైమ్మద్ నారాయణపేట నుంచి దామరగిద్ద మీదుగా ఆటో(ఏపీ 21 టీజెడ్) లో మద్దూర్‌కు గుట్కాలు తరలిస్తున్నాడు. దామరగిద్ద శివారులో ఆటోను తనిఖీ చేసి రూ.3,38,600 విలువ చేసే గుట్కా పాకెట్లను పట్టుకున్నారు. నిషేధిత అంబర్ జర్దా గుట్కా పాకెట్లను తరలిస్తున్న ఆటోను దామరగిద్ద పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి నిందితుడు ఖతల్ హమ్మద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, గుట్కాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఏఎస్ఐ తెలిపారు.



గుట్కాలను తరలిస్తున్న ఆటో

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

- అండర్-17 బాల, బాలికల ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభంలో డీఈఓ రవీందర్



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ రవీందర్

జడ్చర్ల టౌన్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని.. ఓటమి తర్వాతే గెలుపు ఉంటుందని మహబూబ్‌నగర్ డీఈఓ రవీందర్ అన్నారు. శుక్రవారం జడ్చర్ల మున్సిపాలిటీలోని బాదేపల్లి బాలుర జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-17 బాల, బాలికల ఫుట్‌బాల్ టోర్నీని ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. గెలిచిన వారు మరో గెలుపు కోసం పోరాడాలని, ఓడిన వారు లోపాలు ఎక్కడున్నాయో తెలుసుకుని వాటిని సరిదిద్దుకుని విజయం కోసం కృషిచేయాలన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చి రాష్ట్రజట్టుకు ఎంపిక య్యేందుకు ప్రయత్నించాలన్నారు. టోర్నీలో న్యాయనిర్ణేతలు నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రతిభ ఉన్నవారినే జాతీయ పోటీలకు పంపించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని సూచించారు. మహబూబ్‌నగర్ జట్టుపై ఎలాంటి పక్షపాతం చూపరాదని, అప్పుడే రాష్ట్ర జట్టు ప్రతిభావంతులైన క్రీడాకారులతో జాతీయ టోర్నీకి వెళ్తుందన్నారు. డీవైఎస్ఓ శ్రీనివాసులు మాట్లాడుతూ టోర్నీలో పాల్గొంటున్న ప్రతి క్రీడాకారుడు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి గెలుపు కోసం శ్రమించాలన్నారు. అనంతరం వారు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, కౌన్సిలర్లు రఘురాంగౌడ్, ఉమాశంకర్‌గౌడ్, పీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, జిల్లా అధ్యక్షుడు విలియం, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్, వేణుగోపాల్, టీఎస్‌పీఈటీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్, పరిశీలకులు ప్రేమ్ కుమార్, భావన, నిర్వాహకులు మోయిన్, కృష్ణ, హెచ్ఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. టోర్నీలో ఉమ్మడి పది జిల్లాల నుంచి బాలుర 10, బాలికల 10 జట్లు హాజరయ్యారు.



టోర్నీలో పాల్గొంటున్న ఉమ్మడి పది జిల్లాల జట్లు

ముగిసిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు



విజేత జట్టు రంగారెడ్డి జిల్లా క్రీడాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న అతిథులు

- విజేత రంగారెడ్డి జిల్లా.. రెండోస్థానంలో నిలిచిన ఖమ్మం

గద్వాల అర్బన్: గద్వాలలోని ఇండోర్ స్టేడియం, సోమనాద్రి స్టేడియంలో నాలుగు రోజులుగా కొనసాగిన అండర్-17 బాలుర రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఉదయం జరిగిన సెమీ ఫైనల్ పోరులో రంగారెడ్డి-ఖమ్మం, ఆదిలాబాద్-మెదక్ జట్లు తలబడగా రంగారెడ్డి, ఖమ్మం జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరాయి. మధ్యాహ్నం తుది పోరు ప్రారంభంకాగా.. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం నిర్ణీత 15 ఓవర్లలో 116 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి జట్టు 14 ఓవర్లలో 117 పరుగులు చేసి విజేతగా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, డీవైఎస్ఓ ఆనంద్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని.. క్రీడా పోటీల్లో మెళకువలు నేర్చుకొని ప్రతి భ చాటాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. విజేతలుగా నిలిచిన రంగారెడ్డి, రన్నర్‌గా నిలిచిన ఖమ్మం, తృతీయ స్థానంలో నిలిచిన అదిలాబాద్ జట్లకు బహుమతులు అందజేశారు.

జాతీయ స్థాయికి క్రీడాకారుల ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు

మక్తల్: మక్తల్‌కు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైనట్లు రాష్ట్ర క్రీడల అసోసియేషన్స్ ఉపాధ్యక్షుడు రిటైర్డ్ పీఈటీ గోపాలం వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 5, 6 తేదీల్లో తొర్రూర్‌లో జరిగిన సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి క్రీడల్లో నిర్వహించిన ఎంపికల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. మక్తల్‌కు చెందిన శాంతినికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.మధుప్రియ, పావని, బాలుర విభాగాల్లో అక్షర పాఠశాలకు చెందిన విద్యార్థి బస్వరాజ్, స్కాలర్ జూనియర్స్‌కు చెందిన విద్యార్థి రంజిత్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 26 నుంచి 29 వరకు బీహార్ రాష్ట్ర రాజదాని పాట్నాల్లో కొనసాగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్, కోచ్ రమేష్, పీఈటీ రమేష్‌కుమార్, సత్యఆంజనేయలు, నర్సింహగౌడ్, రూప, దీప, అంబ్రేస్, రాఘవేందర్, ఆంజనేయులు, షాబుద్దీన్, లక్ష్మి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా రగ్బీ ఎంపికలు



ఉమ్మడి జిల్లా రగ్బీ జట్లతో డీవైఎస్ఓ శ్రీనివాస్, తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి క్రీడల్లో జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కొంపల్లిలో ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రగ్బీ పోటీల్లో పాల్గొనే అండర్-14 ఉమ్మడి జిల్లా బాలబాలికల ఎంపికలను శుక్రవారం జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహించారు. ఎంపికల్లో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 150 మంది బాలబాలికలు హాజరయ్యారు. వీరిని జట్లుగా విభజించి మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. నిరంతరం క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తే నైపుణ్యం గల క్రీడాకారులుగా ఎదగవచ్చని అన్నారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగాలని కోరారు. క్రీడా పోటీల్లో ఓడిన వారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని కోరారు. జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి వేణుగోపాల్, పీడీలు సూర్యప్రకాశ్‌రావు, పరశురాం, రాములు, ఉమాపతిరెడ్డి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు బయల్దేరిన పీయూ జట్టు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సౌత్‌జోన్ ఫుట్‌బాల్ పోటీలకు పాలమూరు యూనివర్సిటీ జట్టు శుక్రవారం బయల్దేరింది. ఈనెల 10నుంచి 15వ తేదీ వరకు యూనివర్సిటీ ఆఫ్ కేరళలో నిర్వహించే టోర్నీలో పీయూ జట్టు పాల్గొంటుందని పీడీ శ్రీనివాసులు, సత్యభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ట్రాక్‌సూట్, యూనిఫాం అందజేసినట్లు పేర్కొన్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శనివారం రాత్రి 7గంటల వరకు కేవలం 317 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు, కుడి కాల్వకు 161 క్యూసెక్కులు క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 388 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 768 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీట్టిం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.048 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

న్యాయం చేయండి..

- ఆర్మీ జవాన్ రమ్యానాయక్ ఆవేదన



జిన్నారంతండాలో ఆర్మీ జవాన్ రమ్యానాయక్ నిర్మిస్తున్న ఇంటి పక్కన ఉన్న విద్యుత్ వైర్లు

గండేడ్: తనకు న్యాయం చేయమని అడిగితే డబ్బులు అడుగుతున్నారని ఓ ఆర్మీ జవాన్ ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని జిన్నారంతండాకు చెందిన రమ్యానాయక్ జమ్ముకాశ్మీర్‌లో ఆర్మీజవాన్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 9న స్వగ్రామం జిన్నారంతండాకు వచ్చాడు. ఇల్లు కట్టుకోవాలని నిర్ణయించుకోగా.. విద్యుత్ వైర్లు అడ్డుగా ఉండటంతో తొలగించాలని విద్యుత్ శాఖ సిబ్బందిని కోరారు. ఇన్నాళ్లు దాటవేస్తూ వచ్చిన విద్యుత్ సిబ్బంది.. తాజాగా రూ.40 వేలు ఇస్తేనే మారుస్తామని చెబుతున్నారని ఆర్మీ జవాను రమ్యానాయక్ ఆరోపించారు. తాను ఆర్మీ జవాను అని చెప్పినా స్పందించడం లేదని వాపోయాడు. తాను తిరిగి విధులకు వెళ్లాల్సి ఉందని, ఇల్లు పని సగం వచ్చిందని పైకి వస్తే వైర్లు తగులుతాయని తొలగించాలని కోరినా పట్టించుకోకపోగా డబ్బులు డిమాండు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే విద్యుత్ వైర్లు తొలగించాలని కోరారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా ఇల్లుకు వైర్లు అడ్డం అవుతున్నాయని తొలగించాలని కోరిన మాట వాస్తవమేనని, ఇందుకు సంబంధించి డీడీ చెల్లిస్తే మెటీరియల్ ఇచ్చి లైను మారుస్తామని చెప్పామని, డబ్బులు అడగలేదని వివరించారు.